సాక్షి పెద్దపల్లి

శనివారం । 7 । అక్టోబర్ । 2023

బొడ్డెమ్మ.. బొడ్డెమ్మ కోల్



మంథని: మంత్రపురిలో బొడ్డెమ్మ వేడుకలు వైభవంగా ప్రారంభమయ్యాయి. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు ఉట్టిపడేలా ఆడపడచులు ఆటాపాటలతో సందడి చేస్తున్నారు. మూడు నుంచి పదకొండు రోజుల పాటు వేడుకలు నిర్వహిస్తారు.

- వివరాలు 8లో▸

గరిష్టం/కనిష్టం 29.0/26.0

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. గాలిలో తేమశాతం అధికంగా నమోదవుతుంది. ఈదురుగాలులు వీచే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

అప్రమత్తంగా ఉండాలి



సూచనలిస్తున్న ఏసీపీ మహేశ్

ఓదెల(పెద్దపల్లి): త్వరలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో పోలీస్ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని పెద్దపల్లి ఏసీపీ మహేశ్ సూచించారు. శుక్రవారం రాత్రి జిల్లా సరిహద్దు పొత్కపల్లి పోలీస్‌స్టేషన్ పరిధి గుంపుల మానేరు సమీపంలో ఏర్పాటు చేసిన పోలీస్ చెక్‌పోస్టును ఆయన ప్రారంభించారు. ఏసీపీ మాట్లాడుతూ, కరీంనగర్, వరంగల్, హన్మకొండ జిల్లాల మీదుగా గుంపుల నుంచి జిల్లాకు వచ్చిపోయే వాహనాలను తరచూ తనిఖీ చేయాలన్నారు. అనుమతి లేకుండా వచ్చే వాహనాలను తప్పనిసరిగా ఆపివేయాలని సూచించారు. రాత్రిపూట గస్తీ ముమ్మరం చేయాలని, నిబంధనలు కచ్చితంగా పాటించాలని ఆదేశించారు. సుల్తానాబాద్ సీఐ జగదీశ్, పొత్కపల్లి ఎస్సై శ్రీధర్ పాల్గొన్నారు.

ఆశ వర్కర్ల సమ్మె నోటీసు



నోటీసు ఇస్తున్న ఆశ వర్కర్లు

పెద్దపల్లిరూరల్: ప్రతినెలా కనీస వేతనం రూ.18వేలు చెల్లించాలని, ప్రమాద బీమా, రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ వర్తింపజేయాలని ఆశ వర్కర్లు కోరారు. ఈమేరకు సీఐటీయూ ఆధ్వర్యంలో శుక్రవారం జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి కార్యాలయంలో సమ్మె నోటీసు అందజేశారు. పల్లెల్లో ఇంటింటికీ తిరిగి సేవలు అందించే ఆశ వర్కర్లకు కనీస వేతనాలు చెల్లించాలని జిల్లా సహాయ కార్యదర్శి జ్యోతి కోరారు. లేదంటే సమ్మె బాట పట్టక తప్పదని హెచ్చరించారు. నాయకులు శారద, సువర్ణ, రజిత, స్వప్న, మంజుల, కోమల, సరోజన తదితరులు పాల్గొన్నారు.

యువతకు ఉద్యోగాల కల్పనే ప్రభుత్వ లక్ష్యం



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ప్రతినిధులు

గోదావరిఖని: రామగుండం నియోజకవర్గంలోని నిరుద్యోగులకు ఉపాధి కల్పించేందుకు మెగాజాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే కోరుకంటి చందర్ తెలిపారు. ఈమేరకు శుక్రవారం స్థానిక క్యాంపు కార్యాలయంలో ప్రచార పోస్టర్ ఆవిష్కరించారు. తెలంగాణ అకాడమీ ఫర్ స్కిల్ అండ్ నాలెడ్జ్ (టాస్క్)ఆధ్వర్యంలో ఈనెల 9న గోదావరిఖని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో మెగా జాబ్ మేళా ఏర్పాటు చేశామన్నారు. తెలంగాణతోపాటు ఇతర రాష్ట్రాల నుంచి 40 కంపెనీలు పాల్గొంటాయని తెలిపారు. జాబ్ మేళాలో దివ్యాంగులకు తొలి ప్రాధాన్యత ఉంటుందని అన్నారు. టాస్క్ సీఈవో శ్రీకాంత్ సిన్హా, మాట్లాడుతూ, ఈ ప్రాంత నిరుద్యోగ యువత జాబ్ మేళాలలో ఉద్యోగాలు సాధించాలన్నారు. డిప్యూటీ మేయర్ నడిపెల్లి అభిషేక్‌రావు, కౌశిక్ హరి, టాస్క్ ప్రతినిధులు ప్రదీప్‌రెడ్డి, అనిల్, ప్రసాద్, మారుతి, రమేశ్ పాల్గొన్నారు.

బీఎస్పీతోనే పేదలకు మేలు



కండువాకప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఉష

పెద్దపల్లిరూరల్: బహుజనులు ఏకమైతే రాజ్యాధికారం సాధ్యమని బీఎస్పీ పెద్దపల్లి ఎమ్మెల్యే అభ్యర్థి దాసరి ఉష అన్నారు. గోపయ్యపల్లిలో శుక్రవారం మన ఊరు.. మన ఉష.. కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఉష మాట్లాడారు. బీఆర్ఎస్ పాలన అవినీతి మయమైందని ఆరోపించారు. ప్రజలపై పన్నులు, ధరలభారం మోపారని విమర్శించారు. బహుజన సమాజ్ పార్టీకి అండగా నిలిస్తే పేదల కష్టాలన్నీ దూరం చేసేలా పాలన సాగుతుందని చెప్పారు. అంతకుముందు పెద్దపల్లిలోని పార్టీ కార్యాలయం వద్ద పలు పార్టీలకు చెందిన నాయకులకు కండువా కప్పి ఆహ్వానించారు. నాయకులు కొమురయ్య, రాహుల్, అరుణ, సుజాత, రాజేశ్వరి, సంధ్య, సుజాత, అక్షయ, శోభ, సంపత్, రజిత, నర్సయ్య, మల్లేశం, రాములు, రియాజ్ ఉన్నారు.

మళ్లీ బూడిద వివాదం

- బయటపడిన కాంట్రాక్టర్ల మధ్య ఆధిపత్య పోరు
- లారీ రేటు విషయంలో కుదరని సయోధ్య
- వినియోగదారులపై రూ.15 కోట్ల భారమంటున్న ఒకవర్గం
- ప్రస్తుత ధర గిట్టుబాటు కాదంటున్న మరోవర్గం
- పోలీసుల వద్దకు పంచాయితీ, ఎన్టీపీసీకి ఫిర్యాదులు
- త్వరలో న్యాయస్థానాన్ని ఆశ్రయించనున్న కాంట్రాక్టర్లు



ఎన్టీపీసీ బూడిద చెరువు(ఫైల్)

సాక్షిప్రతినిధి, కరీంనగర్: రాష్ట్రంలో నిర్మాణ రంగానికి కీలక ముడిసరుకుగా ఉన్న పెద్దపల్లి జిల్లాలోని రామగుండం ఎన్టీపీసీ బూడిద(ఫ్లైయాష్) మరోసారి చర్చనీయాంశంగా మారింది. ఇటీవల టెండర్లు దక్కించుకున్న రెండువర్గాల మధ్య లారీ రేటు విషయంలో తలెత్తిన ఆధిపత్యపోరు చివరికి ఫ్లైయాష్ తరలింపు నిలిచిపోయే పరిస్థితికి కారణమవుతోంది. ఇటీవల ఏడాదికాలానికి టెండర్లు దక్కించుకున్న కాంట్రాక్టర్లలో రెండువర్గాలు ఉన్నాయి. ఎన్టీపీసీ నియమాల ప్రకారం.. బూడిదను కేవలం వినియోగదారులే తీసుకోవాలి. బహిరంగ మార్కెట్లో విక్రయించకూడదు. తమకు ఎన్టీపీసీ నుంచి టన్ను రూ.40 చొప్పున వస్తున్నపుడు తాము ప్రతీ 25 టన్నుల లారీకి రూ.1100 (జీఎస్టీతో కలిపి), రూ.1,500 లోడింగ్, రూ.400 ఇతర చార్జీలు.. మొత్తం కలిపి లారీకి రూ.3,000 లోడింగ్, రవాణా, టోల్ చార్జీలు కలిపి మరో ప్రతీలారీపై తమకు ఉమ్మడి జిల్లాలో వివిధ ప్రాంతాల సరఫరాకు ట్రిప్పుకు రూ.7,000 వరకు ఖర్చవుతుందని చెబుతున్నారు. అదే మరోవర్గం.. ఈ రేటుపై ససేమీరా అంటోంది, తమకు ఈ ధర గిట్టుబాటు కాదని సుమారు రూ.5,000 వరకు లోడింగ్ చార్జీలే అవుతాయని, మొత్తం లారీ మీద ఉమ్మడి జిల్లాలో రూ.10,000పైగా ఖర్చవుతోందని వాదిస్తోంది. అయితే, తమకు 50,000 ట్రిప్పులు (లారీ 25 టన్నులు) అవసరమవుతాయని.. ఆ ప్రకారం రూ.35 కోట్లు ఖర్చు అవుతుందని, అదే ట్రిప్పుకు రూ.10,000 చొప్పున ఖర్చయితే మొత్తం రూ.50 కోట్లు దాటుతోందని అంటున్నారు. అదనంగా

2021 సెప్టెంబరు ముందు ధరలు	
25 టన్నుల బూడిద లారీ	రూ.700
టన్ను బూడిద ధర	రూ.23.30
2022 సెప్టెంబరు తర్వాత ధరలు	
25 టన్నుల లారీ ధర	రూ.12,000
టన్ను బూడిద ధర	రూ.400
2023 ఆగస్టు తర్వాత ధరలు	
25 టన్నుల లారీ ధర	రూ.10,000
టన్ను బూడిద ధర	రూ.40

(నోట్: ఈ ప్రతిపాదిత ధరల విషయంలోనే వివాదం చెలరేగింది)

రూ.15 కోట్లకుపైగా భారం ఉమ్మడి జిల్లాలోని ఇటుక పరిశ్రమలు, నిర్మాణ రంగాలపై మీద పడుతోందని అంటున్నారు. ఈ బూడిద రాష్ట్రవ్యాప్తంగా సరఫరా అవుతోంది. ఉమ్మడి జిల్లా పరిధిలో ట్రిప్పుకు రూ.10వేలు అయితే, ఇతర జిల్లాలు.. హైదరాబాద్‌కు అంతకుమించి ఖర్చు అవుతోందని స్పష్టం చేస్తున్నారు.


పోలీసుల వద్దా కుదరని సయోధ్య

ఇరువర్గాల మధ్య నెలకొన్న పీఠముడి కాస్తా వెయ్యి ఎకరాల్లో విస్తరించిన బూడిద చెరువు నుంచి బూడిద తరలించకుండా నిలిచిపోయే పరిస్థితులు వచ్చాయి. దీంతో వివాదం పోలీసుల వరకూ వెళ్లింది. పోలీసులు ఎంత నచ్చజెప్పినా.. వీరిమధ్య సయోధ్య కుదరలేదు. అందులో ఒకవర్గం వారు మరోవర్గం వారిని అంతుచూస్తామని హెచ్చరించినట్లు సమాచారం. దీనిపై ఆందోళన చెందిన కొందరు కాంట్రాక్టర్లు.. అసలు అవతలి వర్గం.. నిబంధనలకు విరుద్ధంగా టెండర్లు దక్కించుకుందని, వారిపై చర్యలు తీసుకోవాలని ఎన్టీపీసీ యాజమాన్యానికి, రామగుండం పోలీసులకు ఫిర్యాదు చేశారు. అనర్హతలతో ఎన్టీపీసీని తప్పుదోవ పట్టించి, తప్పుడు సమాచారంతో టెండర్లు దక్కించుకున్న వారిని తప్పించేలా త్వరలోనే హైకోర్టును ఆశ్రయిస్తామని స్పష్టం చేస్తున్నారు.

బూడిద నేపథ్యం..

రామగుండం ఎన్టీపీసీలో 2600 మెగావాట్ల విద్యుత్తు ఉత్పత్తికి రోజూ 32వేల టన్నుల బొగ్గు మండించగా, సుమారు 13వేల టన్నుల బూడిద (ఫ్లైయాష్), బాటం యాష్ రూపంలో వెలువడుతుంది. కొత్తలో ఈ బూడిదను ఎవరూ తీసుకునే వారు కాదు. పర్యావరణ సమస్యలూ తలెత్తాయి. దీంతో ఇటుకల తయారీలో ఫ్లైయాష్ వినియోగాన్ని కేంద్రం 2000 నుంచి తప్పనిసరి చేసింది. అలా ఇటుకల పరిశ్రమకు బూడిద ఉచితంగా ఇచ్చేవారు. దీనికి రోజురోజుకూ డిమాండ్ పెరిగిన నేపథ్యంలో 2021 సెప్టెంబరులో ఎన్టీపీసీ టెండర్లు పిలిచింది. వేలానికి ముందు రూ.23గా ఉన్న టన్ను బూడిద.. వేలంలో అనూహ్యంగా రూ.400 చొప్పున కాంట్రాక్టర్లు కోట్‌చేసి ధరల పెరుగుదలకు కారణమయ్యారు. అప్పటివరకు 25 టన్నుల వరకు రూ.700గా ఉన్న లారీ రూ.12,000గా పలికింది. ఈ ప్రభావం ఇటుకల పరిశ్రమ, నిర్మాణ రంగంపై పడి రెండు గదుల ఇంటి నిర్మాణానికి రూ.30వేల భారం పడింది. ఈ విషయాన్ని గతేడాది ‘సాక్షి’ వెలుగులోకి తెచ్చింది. తాజా వేలంలో టన్ను బూడిద రూ.40 మాత్రమే పలికినా, ట్రిప్పు రేటు విషయంలో ఇరువర్గాల మధ్య వివాదం కొలిక్కి రావడం లేదు.

కాంగ్రెస్‌లో కొత్త జోష్!



మేనిఫెస్టోలో పొందుపర్చాల్సిన అంశాలపై ప్రతిపాదనలు స్వీకరిస్తున్న మంథని ఎమ్మెల్యే శ్రీధర్‌బాబు

- మేనిఫెస్టో కమిటీ భేటీతో ఉత్సాహం
- పసుపు–కుంకుమ, ఆరు గ్యారంటీలపై విస్తృత ప్రచారం
- ప్రకటనకు ముందే ఆశావహుల ప్రచారం మొదలు
- హుజూరాబాద్ బరిలో వొడితెల ప్రణవ్!

సాక్షిప్రతినిధి, కరీంనగర్: కాంగ్రెస్ పార్టీలో కొత్త జోష్ నింపేందుకు అధిష్టానం నడుం బిగించింది. తాజాగా ఉమ్మడి కరీంనగర్ జిల్లా నాయకులతో కలిసి మేనిఫెస్టో కమిటీ చైర్మన్ దుద్దిళ్ల శ్రీధర్‌బాబు సమావేశమైన వేళ.. పసుపు–కుంకుమ పథకం ప్రకటనతో పార్టీ హామీలు ప్రజల్లోకి మరింత లోతుగా చొచ్చుకెళ్తాయని కాంగ్రెస్ ధీమాగా ఉంది. గతంలో ప్రకటించిన ఆరు గ్యారంటీ పథకాలకు తోడు తాజాగా ప్రకటించిన పసుపు–కుంకుమ పథకం ప్రతిపాదన కరీంనగర్‌లోనే పురుడు పోసుకోవడం, దానికి మేనిఫెస్టో కమిటీ సూత్రప్రాయ ఆమోదం తెలపడం నాయకులు, కార్యకర్తల్లో కొత్త ఉత్సాహం నింపింది. శుక్రవారం ఉదయం భేటీ అయిన మేనిఫెస్టో కమిటీ పలువురు నుంచి ప్రతిపాదనలు తీసుకుంది. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ జీవన్ రెడ్డితోపాటు కొందరు నాయకులు పసుపు–కుంకుమ పథకాన్ని ప్రతిపాదించారు. ఇపుడున్న కల్యాణలక్ష్మి, షాదీముబారక్‌లను కొనసాగిస్తూనే.. వధువుకు తులం బంగారంతో తాళిబొట్టు, వెండి మెట్టెలు కూడా అందజేయాలన్న ప్రతిపాదనను కమిటీ స్వాగతించింది. దీన్ని గాంధీభవన్‌లోని పార్టీ పెద్దలు, అధిష్టానం దృష్టికి తీసుకెళ్లి ఆమోదించుకునే పనిలో ఉన్నారు. వీటితోపాటు ఇటీవల ప్రకటించిన ఆరు గ్యారంటీలు మహాలక్ష్మి ద్వారా మహిళలకు రూ.2,500 సాయం, రూ.500కే గ్యాస్ సిలిండర్, మహిళలకు బస్సుల్లో ఉచిత ప్రయాణం, రైతు భరోసా ద్వారా రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ, వ్యవసాయ కూలీలకు రూ.1,200, కౌలు రైతులకు ఏటా రూ.12 వేల సాయంలను జనాల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని నిర్ణయించారు. ఉమ్మడి జిల్లాలోని 13 నియోజకవర్గాల్లో ముమ్మరంగా ప్రచారం చేయాలని తీర్మానించారు.

ప్రణవ్ రాక సంచలనం..



వొడితెల ప్రణవ్ కాంగ్రెస్ తీర్థం పుచ్చుకోవడం కరీంనగర్ ఉమ్మడి జిల్లా రాజకీయాల్లో సంచలనం రేపింది. గులాబీ పార్టీ ఆవిర్భావం నుంచి మాజీ ఎంపీ రాజేశ్వరరావు కుటుంబ వారసత్వం, ఎమ్మెల్యే వొడితెల సతీశ్‌బాబు, కెప్టెన్ లక్ష్మీకాంతరావు, జీవీ రామకృష్ణారావులకు రక్త సంబంధీకుడు కావడంతో అన్ని పార్టీల్లోనూ ఆయన చేరిక చర్చనీయాంశంగా మారింది. సామాజికంగా, ఆర్థికంగా ప్రణవ్ రాక కాంగ్రెస్ పార్టీకి మేలు చేస్తుందని కేడర్ ధీమా వ్యక్తం చేస్తోంది.

అల్పాహారం ఎలా ఉంది?

- విద్యార్థులను ప్రశ్నించిన కలెక్టర్ ముజమ్మిల్‌కాన్
- జిల్లాలోని 549 ప్రభుత్వ స్కూళ్లలో ప్రారంభం
- హాజరైన పెద్దపల్లి ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి



విద్యార్థులకు అల్పాహారం వడ్డిస్తున్న కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్

పెద్దపల్లిరూరల్: తొలిరోజు ప్రారంభించిన సీఎం అల్పాహారం ఎలా ఉంది? అని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ విద్యార్థులను ప్రశ్నించారు. జిల్లా కేంద్రంలోని అమర్ నగర్ ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్, ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డితో కలిసి శుక్రవారం సీఎం అల్పాహార పథకం ప్రారంభించారు. కలెక్టర్, ఎమ్మెల్యే విద్యార్థులకు అల్పాహారం వడ్డించారు. వారితో కలిసి టిఫిన్ చేశారు. అల్పాహారం నాణ్యంగా, రుచిగా ఉందా? అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. మెనూ ప్రకారం రోజూ విద్యార్థులకు టిఫిన్ అందించాలని సిబ్బందికి సూచించారు. జిల్లావ్యాప్తంగా 549 ప్రభుత్వ పాఠశాలల్లో ఈ పథకాన్ని ప్రారంభించామని కలెక్టర్ తెలిపారు. విద్యార్థులకు ఉదయం అల్పాహారం అందిస్తే వారి ఎదుగుదలకు దోహదపడుతుందని కలెక్టర్ తెలిపారు. ఏకాగ్రత పెరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ మమతారెడ్డి, జిల్లా విద్యాశాఖ అధికారి మాధవి, అకడమిక్ కో ఆర్డినేటర్ పీఎం షేక్, ప్రధానోపాధ్యాయులు, టీచర్లు పాల్గొన్నారు.

బల్దియాలో టెండర్ల వివాదం?

కోల్‌సిటీ: రామగుండం కార్పొరేటషన్‌లోని 50 డివిజన్లలో బతుకమ్మ పండుగ కోసం విద్యుత్ దీపాల ఏర్పాటుకు పిలిచిన టెండర్ల ప్రక్రియ వివాదస్పదంగా ఉందని కొందరు కాంట్రాక్టర్లు శుక్రవారం రాత్రి ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. సుమారు రూ.25 లక్షలపైచిలుకు పనుల టెండర్ స్థానిక కాంట్రాక్టర్లకు దక్కకుండా, తమకు అనుకూలమైన వారికే వచ్చేలా కుట్రపూరితంగా కొత్త నిబంధన విధించారని ఆరోపణలు వస్తున్నాయి. దీనిపై మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ నాగేశ్వర్‌ను వివరణ కోరగా, నిబంధనల మేరకే టెండర్లు ఆహ్వానించాలని సూచించామన్నారు. విద్యుదాఘాతం జరగకుండా, విద్యుత్ దీపాల ఏర్పాటుకు అనుభవం కలిగిన వారే ఉండేలా నిబంధన విధించినట్లు ఇంజినీర్లు పేర్కొన్నారని కమిషనర్ వివరించారు.

బాల్యం నుంచే పౌష్టికాహారం

రామగుండం ఎమ్మెల్యే చందర్



విద్యార్థులతో కలిసి అల్పాహారం చేస్తున్న చందర్

రామగుండం: సీఎం అల్పాహార పథకం ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల హాజరుశాతం పెరగడమే కాకుండా బాల్యదశ నుంచే పౌష్టికాహారం అందుతుందని రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్ అన్నారు. స్థానిక మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం ఆయన సీఎం అల్పాహార పథకం ప్రారంభించారు. అదనపు కలెక్టర్ అరుణశ్రీతో కలిసి మాట్లాడారు. కార్పొరేటర్ కౌశిక లత, మున్సిపల్ కమిషనర్ నాగేశ్వర్, ఎంఈవో సంపత్‌రావు, హెచ్‌ఎం మనోహర్‌రావు, జెడ్పీటీసీ ఆముల నారాయణ, కార్మిక సంఘం ప్రతినిధి కౌశిక హరి, సీడీపీవో స్వరూపరాణి, హెచ్‌ఎం అజ్మీరా శారద, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు బొడ్డుపల్లి శ్రీనివాస్ పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల స్థితిగతులపై సమీక్ష

ప్రభుత్వ పాఠశాలల స్థితిగతులపై ఎమ్మెల్యే చందర్ అదనపు కలెక్టర్ అరుణశ్రీతో కలిసి సమీక్షించారు. మరుగుదొడ్లు, మూత్రశాలలు, ప్రహరీ, క్రీడామైదానం తదితర సమస్యలపై చర్చించారు. రూ.1.50 లక్షలు వెచ్చించి వాష్‌రూమ్స్ నిర్మిస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. కాగా, అంతర్గాం మండలంబ ఆకెనపల్లిలో రూ.1.50 కోట్లతో చేపట్టిన అభివృద్ధి పనులను ఎమ్మెల్యే, అదనపు కలెక్టర్ ప్రారంభించారు. మహిళలకు బతుకమ్మ చీరలు పంపిణీ చేశారు.

‘గుర్తింపు’ నామినేషన్లు షురూ



నామినేషన్ వేస్తున్న ఏఐటీయూసీ నాయకులు



బీఎంఎస్ నాయకులు..



హెచ్‌ఎంఎస్ ప్రతినిధులు..

గోదావరిఖని: సింగరేణిలో గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికల కోసం శుక్రవారం పలు సంఘాలు నామినేషన్ పత్రాలు దాఖలు చేశాయి. ఈనెల 6, 7వ తేదీల్లో షెడ్యూల్ ప్రకారం నామినేషన్ల స్వీకరణ ఉంది. ఎన్నికల నిర్వహణపై యాజమాన్యం నుంచి స్పష్టత రాలేదు. కోర్టు నుంచి కూడా స్పష్టమైన ఆదేశాలు రాలేదు. దీంతో షెడ్యూల్ ప్రకారం నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమైంది. ఏఐటీయూసీ, బీఎంఎస్, హెచ్‌ఎంఎస్, సీఐటీయూ నాయకులు హైదరాబాద్‌లోని రీజినల్ లేబర్ కమిషనర్ కార్యాలయంలో నామినేషన్ పత్రాలు దాఖలు చేశారు. సింగరేణి యాజమాన్యంతో కూడా కార్మిక సంఘాల ప్రతినిధులతో సమావేశమయ్యే అవకాశాలు ఉన్నట్లు సమాచారం.

కాంగ్రెస్‌కు ఒక్క అవకాశం ఇవ్వండి

డీసీసీ అధ్యక్షుడు ఎంఎస్ రాజ్‌ఠాకూర్



గజమాలతో సన్మానిస్తున్న కాంగ్రెస్ శ్రేణులు

యైటింక్లయిన్‌కాలనీ: వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ఒక్క అవకాశం ఇవ్వాలని డీసీసీ అధ్యక్షుడు మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ కోరారు. ఆర్జీ–2 ఏరియా ఓసీపీ–3లోని దుర్గాదేవి ఆలయంలో శుక్రవారం ఆయన ప్రత్యేక పూజలు చేసి ప్రజాఆశీర్వాద పాదయాత్ర ప్రారంభించారు. 15, 16, 17, 18, 19వ డివిజన్ల పాదయాత్ర కొనసాగించారు. కాంగ్రెస్ ఆరు గ్యారెంటీ పథకాలు వివరిస్తూ ఇంటింటా పర్యటించారు. కాంగ్రెస్ పార్టీ జిల్లా వైస్ ప్రెసిడెంట్ మారెల్లి రాజిరెడ్డి, కాలనీ పట్టణ అధ్యక్షుడు గుండేటి రాజేశ్, నాయకులు చక్రపాణి, సారయ్య నాయక్, రాజు, రాజేశం, కిషన్ నాయక్, తిరుపతిరెడ్డి, సునీత, అనిత, కళావతి తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరికలు

జ్యోతినగర్(రామగుండం): అవినీతి బీఆర్ఎస్ పాలనలో విసిగిన ప్రజలు కాంగ్రెస్‌లో చేరుతున్నారని డీసీసీ అధ్యక్షుడు రాజ్‌ఠాకూర్ మక్కాన్‌సింగ్ అన్నారు. మూడోడివిజన్ న్యూపోరట్‌పల్లిలో 200మంది కాంగ్రెస్‌లో చేరగా వారికి కండువాలు కప్పి స్వాగతించారు. కార్పొరేటర్ మహంకాళి స్వామి, నాయకులు ఆసిఫ్ పాషా, లింగమూర్తి పాల్గొన్నారు.

జీజీహెచ్‌లో నర్సింగ్ సిబ్బంది సంబురాలు

నర్సింగ్ ఆఫీసర్లుగా పేరు మార్పుపై వేడుకలు



ఆనందరం వ్యక్తం చేస్తున్న నర్సింగ్ స్టాఫ్

కోల్‌సిటీ: ప్రభుత్వ ఆస్పత్రుల్లో పనిచేస్తున్న స్టాఫ్‌నర్స్‌లు ఇకనుంచి నర్సింగ్ ఆఫీసర్ల హోదాలో పనిచేయనున్నారు. వివిధ హోదాల్లో పనిచేస్తున్న నర్సింగ్ సిబ్బందికి హోదాల పేర్లు మార్పు చేస్తూ వైద్య, ఆరోగ్యశాఖ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. గోదావరిఖని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి(జీజీహెచ్)లో సుమారు 114 మందికిపైగా ఉన్న స్టాఫ్‌నర్స్‌లు ఇకనుంచి నర్సింగ్ ఆఫీసర్ల హోదాలో సేవలు అందించనున్నారు. అలాగే హెడ్‌నర్స్ హోదాను సీనియర్ నర్సింగ్ ఆఫీసర్‌గా, నర్సింగ్ సూపరింటెండెంట్ గ్రేడ్–2 డిజిగ్నేషన్‌ను డిప్యూటీ నర్సింగ్ సూపరింటెండెంట్‌గా, గ్రేడ్ వన్ నర్సింగ్ సూపరింటెండెంట్ హోదాను చీఫ్ నర్సింగ్ ఆఫీసర్‌గా మారుస్తున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొంది. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై జీజీహెచ్‌లోని నర్సింగ్ స్టాఫ్ హర్షం వ్యక్తం చేశారు. శుక్రవారం కేక్ కట్ చేసి మెడికల్ సూపరింటెండెంట్ దయాల్‌సింగ్, ఆర్‌ఎంవో తిరుమలేశకు మిఠాయి తినిపించారు. సీఎం కేసీఆర్, మంత్రి హరీశ్‌రావుకు కృతజ్ఞతలు తెలిపారు. నర్సింగ్ ఆఫీసర్లను సూపరింటెండెంట్ దయాల్‌సింగ్ అభినందించారు. నర్సింగ్ సూపరింటెండెంట్లు విజయ, మర్లిలేనా, సీనియర్ నర్సింగ్ ఆఫీసర్లు విజయలక్ష్మి, పద్మ, నర్సింగ్ ఆఫీసర్లు మేరీ, రుద్రమ, పుష్ప, నీరజ, లక్ష్మి, సుజాత తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

జెడ్పీ చైర్మన్‌ను కలిసిన ఉద్యోగులు



పుష్పగుచ్ఛం అందిస్తున్న ఉద్యోగులు

మంథని: తెలంగాణ పంచాయతీరాజ్ మినిస్టీరియల్ ఉద్యోగుల సంఘం జిల్లా నూతన కార్యవర్గం శుక్రవారం జిల్లా పరిషత్ చైర్మన్ పుట్ట మధును పట్టణంలో కలిశారు. మర్యాద పూర్వకంగా కలిసి ఆయనకు పుష్పగుచ్ఛం అందించారు. సంఘం జిల్లా అధ్యక్షుడు రాజేందర్‌ప్రసాద్, ప్రధాన కార్యదర్శి రంగు రవి, ఉపాధ్యక్షుడు ఉపేందర్, ప్రతినిధులు అంజయ్య, పూర్ణచందర్, మనోహర్‌రెడ్డి, పాషా తదితరులు ఉన్నారు.

మట్టి తరలింపును అడ్డుకున్న అధికారులు



సుల్తానాబాద్‌రూరల్: గట్టెపల్లి శివారులోని ప్రభుత్వ భూమిలోంచి అక్రమంగా మట్టి తరలిస్తుండగా రెవెన్యూ, పోలీసులు శుక్రవారం పట్టుకున్నారు. అనుమతి లేకుండా సర్వే నంబర్ 532లో నుంచి కొందరు వ్యాపారులు జేసీబీ సాయంతో టిప్పర్ల ద్వారా మట్టి తరలిస్తున్నారు. సమాచారం అందడంతో తహసీల్దార్ ఆదేశాల మేరకు గిర్దావర్లు స్వాతి, శ్రీవాణితోపాటు పోలీసులు వాహనాలు పట్టుకున్నారు. వాటిని సీజ్ చేసి తహసీల్దార్ కార్యాయాలనికి తరలించారు. తదుపరి చర్యల నిమిత్తం తహసీల్దార్‌కు నివేదించినట్లు గిర్దావర్లు తెలిపారు.

ప్రొఫెసర్‌కు సన్మానం



గోదావరిఖనిటౌన్: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో హిందీ అసోసియేట్ ప్రొఫెసర్ ఎస్.ఖలందర్‌బాషా పదోన్నతిపై బదిలీ అయ్యారు. ఆయన గద్వాల ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు ప్రిన్సిపాల్‌గా పదోన్నతిపై వెళ్తున్నారు. ఈసందర్భంగా శుక్రవారం ప్రిన్సిపాల్ ఖాజాజహీర్ అహ్మద్, అధ్యాపకులు, సిబ్బంది ఆయనను పూలమాలలు, శాలువాలతో సన్మానించి వీడ్కోలు పలికారు.

లండన్ హతుడు బొప్పాపూర్ వాసి

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): లండన్‌లో గత శనివారం దుండగుల చేతిలో హత్యకు గురైన రాయీసుద్దీన్ ఎల్లారెడ్డిపేట మండలంలోని రాచర్లబొప్పాపూర్‌వాసి. ఈ విషయం స్థానికులకు ఆలస్యంగా తెలిసింది. ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లబొప్పాపూర్‌కు చెందిన చాంద్‌పాషా కుమారుడు రాయీసుద్దీన్ గత శనివారం లండన్‌లో దుండగుల చేతిలో కత్తిపోట్లకు గురయ్యాడు. గత పదమూడేళ్లుగా లండన్‌లో ఉద్యోగరీత్యా స్థిరపడ్డాడు. ఇతరులు గొడవపడుతుండగా అడ్డుగా వెళ్లిన రాయీసుద్దీన్ దారుణ హత్యకు గురైనట్లు తెలిసింది. అయితే వీరి కుటుంబం గత పదేళ్లుగా హైదరాబాద్‌లోని మాసాబ్‌ట్యాంక్‌లో నివసిస్తున్నారు. మృతునికి భార్య, కూతురు, కుమారుడు ఉన్నారు.

రెస్క్యూ పోటీలకు సిద్ధం

- 10, 11 తేదీల్లో నిర్వహణ
- సింగరేణి వ్యాప్తంగా 6జట్లు ఎంపిక
- ప్రతిభ కనబర్చిన సభ్యులకు ఆలిండియా స్థాయిలో అవకాశం
- వచ్చే నెలలో జాతీయస్థాయి పోటీలు ఇక్కడే..



పోటీలకు హాజరైన జట్లు(ఫైల్)

గోదావరిఖని: బొగ్గు గనుల్లో ప్రమాదాలు సంభవించే సమయంలో తక్షణమే స్పందించే రెస్క్యూ బ్రిగేడియర్లలో మరింత పోటీతత్వం, ప్రతిభ పెంచేందుకు సింగరేణి స్థాయిలో ఈనెల 10, 11వ తేదీల్లో రెస్క్యూ పోటీలో నిర్వహించేందుకు సన్నద్ధమైంది. ఆర్జీ–2 ఏరియా మెయిన్ రెస్క్యూ స్టేషన్‌లో రెండ్రోజుల పాటు సాగే పోటీలకు అన్ని ఏర్పాట్లు పూర్తిచేశారు. ఆపద సమయంలో తామున్నామంటూ కార్మికులకు భరోసా, ధైర్యం కల్పిస్తారు. సభ్యుల్లో నిరంతర నైపుణ్యం, చురుకుతనం, ప్రతిభ పెంచేందుకు పోటీలు ఎంతగానో దోహదనం చేస్తాయి. అందుకే ఏటా పోటీలు నిర్వహిస్తున్నారు. సింగరేణిలోని ప్రతీవంద మందికి ఒక రెస్క్యూ సభ్యుడిని నియమించాలని, ఇలా గనికి ఒక రెస్క్యూ టీం ఉండాలని నిబంధనలు చెబుతున్నాయి. జాతీయస్థాయిలో సింగరేణి రెస్క్యూకు ప్రత్యేకత ఉంది. గతంలో జరిగిన కోలిండియా(జాతీయ)స్థాయి పోటీల్లో డబుల్‌హాట్రిక్ సాధించి సింగరేణి రెస్క్యూ అగ్రస్థానంలో నిలిచింది.

పెరిగిన యువ కార్మికుల సంఖ్య

సింగరేణిలో యువ కార్మికుల సంఖ్య పెరిగింది. వీరితోపాటే రెస్క్యూలో కొత్త సభ్యుల ఎంపికకు యాజమాన్యం ప్రాధాన్యమిచ్చింది.

- రెస్క్యూ నిబంధనల ప్రకారం 50శాతం పాత రెస్క్యూ సభ్యులు, మరో 50శాతం కొత్త వారికి, అందులోనూ యువకులకు అవకాశం కల్పిస్తారు.
- ఈక్రమంలోనే ఈసారి కోలిండియాస్థాయిలో సత్తా చాటాలని సింగరేణి ఉవ్విళ్లూరుతోంది.

పలు విభాగాల్లో పోటీలు..

రెస్క్యూ పోటీలు పలు విభాగాల్లో నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. మెయిన్ రెస్క్యూ స్టేషన్‌లో థియరీ, స్టాట్యుటరీ, ఫస్ట్‌ఎయిడ్, డ్రిల్‌పరేడ్, రెస్క్యూ రిలే రేస్ పోటీలు నిర్వహించనున్నారు. ఆర్జీ–2 ఏరియాలోని జీడీకే–7ఎల్‌ఈపీలో ఫ్రెస్ ఎయిర్‌బేస్, రెస్క్యూ, రికవరీ వర్క్, క్యాప్టెన్స్ రిపోర్టు పోటీలు నిర్వహిస్తారు. సంస్థవ్యాప్తంగా ఉన్న ఆరుజట్ల మధ్య పోటీలు ఉంటాయి. ప్రతిభ కనబర్చిన జట్లలోని మెరికల్లాంటి సభ్యులను రెండు జట్లుగా ఎంపిక చేసి కోలిండియా స్థాయి పోటీలకు పంపిస్తారు.

- ప్రతిభ కనబర్చిన మూడు జట్లకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు అందిస్తారు. అత్యంత ప్రతిభ కనబర్చిన 16మందిని కోలిండియా స్థాయి పోటీలకు ఎంపిక చేస్తారు.

ఏర్పాట్లు పూర్తి

సింగరేణిస్థాయి రెస్క్యూ పోటీలకు అన్నిఏర్పాట్లు పూర్తయ్యాయి. జట్టు సభ్యులతోపాటు టీం మేనేజర్లు, కోచ్‌లకు వసతి, సౌకర్యాలు కల్పించాం. ఒకరోజు ముందే జట్లు ఇక్కడకు చేరుకుంటాయి. సీఅండ్‌ఎండీతోపాటు సింగరేణి డైరెక్టర్లు, యూనియన్ నాయకులను కూడా పోటీలకు ఆహ్వానించాం. న్యాయనిర్ణేతలుగా డీడీఎంఎస్‌లు వ్యవహరించనున్నారు.

– ఎల్‌వీ సూర్యనారాయణ, ఆర్జీ–2 జీఎం

వచ్చే నెలలో ఆలిండియాస్థాయి పోటీలు

- వచ్చేనెలలో ఆలిండియా 52వ మైన్స్ రెస్క్యూ పోటీలు సింగరేణి ఆధ్వర్యంలో ఆర్జీ–2 ఏరియాలోని మెయిన్‌రెస్క్యూ స్టేషన్‌లో నిర్వహించనున్నారు. నవంబర్–27 నుంచి డిసెంబర్–1 వరకు పోటీలు ఉంటాయి. ఈ పోటీల్లో 19 కోల్ కంపెనీ జట్లు, 7మెటల్ మైన్స్ జట్లు పాల్గొననున్నాయి.

బొగ్గు బాయి వార్తలు

రక్షణ సూత్రాలు పాటించాలి



మాట్లాడుతున్న సేఫ్టీ జీఎం సాంబయ్య

రామగిరి: విధి నిర్వహణలో రక్షణ సూత్రాలు పాటించాలని రామగుండం రీజియన్ సేఫ్టీ జనరల్ మేనేజర్ సాంబయ్య సూచించారు. స్థానిక ఏపీఏ గనిని జీఎం వెంకటేశ్వర్లుతో కలిసి ఆయన సందర్శించారు. కార్మికులు తీసుకోవాల్సిన జాగ్రతల గురించి వివరించారు. పనిస్థలాల్లో అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. ఇదేసమయంలో రక్షణతో కూడిన ఉత్పత్తి సాధించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్టు అధికారి కె.నాగేశ్వర్‌రావు, సూపరింటెండెంట్ ఆఫ్ మైన్స్ కె.జనార్దన్, పిట్ ఇంజినీర్ వీజే వెంకటేశ్, అధికారులు పాల్గొన్నారు.

'డిస్మిస్ కార్మికులను మోసం చేశారు'



వినతిపత్రం విడుదల చేస్తున్న డిస్మిస్ కార్మికులు

గోదావరిఖని: వివిధ కారణాలతో డిస్మిస్ అయిన సింగరేణి కార్మికులను టీబీజీకేఎస్, యాజమాన్యం మోసం చేశాయని పలువురు ఆరోపించారు. షరతులు లేకుండా, వన్ టైం సెటిల్‌మెంట్ విధానంలో అవకాశం కల్పిస్తామని మభ్యపెట్టారని ధ్వజమెత్తారు. రెండేళ్లలో వరుసగా 100 మస్టర్లు నిబంధన చేర్చి 95శాతం మంది నష్టపోయేలా ఉత్తర్వులు జారీచేయడం శోచనీయమన్నారు. టీబీజీకేఎస్ నిర్వాకంతో డిస్మిస్ కార్మికులకు చావుతప్ప మరో దారిలేదని విమర్శించారు. హెచ్‌ఎంఎస్, ఐఎన్టీయూసీ, ఏఐటీయూసీ, సీఐటీయూ, బీఎంఎస్ నాయకులు చొరవ తీసుకుని షరతులు లేకుండా సింగరేణితో చర్చించి ఉత్తర్వులు జారీచేయించాలని కోరారు.

టీబీజీకేఎస్‌తోనే సమస్యలకు పరిష్కారం



కార్మికులతో మాట్లాడుతున్న ఐలి శ్రీనివాస్

యైటింక్లయిన్‌కాలనీ: టీబీజీకేఎస్‌తోనే కార్మికుల సమస్యలు పరిష్కారం అవుతాయని ఆ యూనియన్ ఆర్జీ–2 ఏరియా వైస్ ప్రెసిడెంట్ ఐలి శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం ఓసీపీ–3 కృషి భవన్‌ను ఆయన సందర్శించి కార్మికులతో మాట్లాడారు. 70కిపైగా హక్కులు సాధించిన ఘనత టీబీజీకేఎస్‌కే దక్కిందనఅనరు తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించాక 19వేలకుపైగా కొత్త ఉద్యోగాలు భర్తీచేశారని తెలిపారు. నాయకులు రవీందర్, తిరుపతి, గట్టయ్య, సంపత్, నరేశ్, రాజేశం, శ్రీను, వెంకన్న, సత్యనారాయణ, ఐలయ్య, రమేశ్, కార్మికులు పాల్గొన్నారు.

సింగరేణి ఉద్యోగి ఆత్మహత్య

కోల్‌సిటీ: కుటుంబ కలహాలతో గూడ మహేందర్ (35)అనే సింగరేణి ఉద్యోగి ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. గోదావరిఖని మార్కండేయ కాలనీకి చెందిన మహేందర్ సింగరేణి ఉద్యోగం చేస్తున్నాడు. 15 సంవత్సరాల క్రితం తల్లిదండ్రులు చనిపోయారు. ఎనిమిదేళ్ల క్రితం ఓ యువతిని ప్రేమ వివాహం చేసుకున్నాడు. వీరికి ప్రస్తుతం ఇద్దరు పిల్లలు సంతానం. కొద్దిరోజులుగా కుటుంబంలో గొడవలు జరుగుతున్నాయి. మనస్థాపం చెందిన మహేందర్ గురువారం అర్ధరాత్రి తన ఇంట్లోని సీలింగ్ ఫ్యాన్‌కు బెడ్‌షీట్‌తో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు వన్‌టౌన్ ఎస్సై సమ్మయ్య తెలిపారు.

గోదావరి జిల్లాల తరహాలో అభివృద్ధి



చేపపిల్లలు పంపిణీ చేస్తున్న జిల్లా పరిషత్ చైర్మన్ పుట్ట మధు

- అల్పాహారం ఓ అద్భుతం
- జిల్లా పరిషత్ చైర్మన్ పుట్ట మధు
- మత్స్యకారులకు చేపపిల్లల పంపిణీ

మంథని: తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల తరహాలో మంథని నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తామని జిల్లా పరిషత్ చైర్మన్ పుట్ట మధు అన్నారు. మత్స్యకారుల అభ్యున్నతికి సీఎం కేసీఆర్ కృషి చేస్తున్నారన్నారు. స్థానిక మత్స్యకారులకు ఆయన చేపపిల్లలను మున్సిపల్ చైర్‌పర్సన్ పుట్ట శైలజతో కలిసి పంపిణీ చేశారు. మధు మాట్లాడుతూ, ముదిరాజ్, బెస్త, బోయ సామాజికవర్గాలు ఆర్థికాభివృదద్ధి సాధించే దిశఘా ప్రభుత్వం ఏడేళ్లుగా చేపపిల్లలు పంపిణీ చేస్తోందన్నారు. చేపలు పట్టడం, పెంచడంలాంటి ఆధునిక పద్ధతులపై మత్స్యకారులకు శిక్షణ కేంద్రాలు అందుబాటులోకి తీసుకొస్తామని ఆయన హామీ ఇచ్చారు. ఈసారి 14 గ్రామాల్లోని మత్స్యకారులకు 9.63లక్షల చేపపిల్లలు పంపిణీ చేస్తున్నామని చెప్పారు.

అల్పాహారం.. ఓ అద్భుతం

సీఎం కేసీఆర్ ప్రారంభించిన అల్పాహార పథకం అద్భుతమని జిల్లా పరిషత్ చైర్మన్ పుట్ట మధు అన్నారు. కాకర్లపల్లి ప్రభుత్వ పాఠశాలలో సీఎం అల్పాహార పథకాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. గ్రామస్తులు తెల్లవారితే ఏదోకూలీ పనికో, వ్యవసాయ పనులకో వెళ్తారని, ఉదయం పాఠశాలకు వెళ్లే తమ బిడ్డలకు మంచి ఆహారం అందించాలనే ఉద్దేశంతో సీఎం ఈ పథకానికి రూపకల్పన చేశారని అన్నారు. చిన్నవాయసులో మంచిఆహారం అందిస్తే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని సీఎం ఆలోచన చేశారన్నారు. అనంతరం కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో పెరటి కూరగాయల విత్తనాలను ఉపాధ్యాయులకు పంపిణీ చేశారు. ఆర్డీవో హనుమ నాయక్, ఎంపీపీ కొండ శంకర్, జెడ్పీటీసీ తగరం సుమలత పాల్గొన్నారు. కాగా, దళితబంధులో ముగ్గురికే అవకాశం కల్పించారని, గృహలక్ష్మిలోనూ న్యాయం దక్కలేదని గ్రామస్తులు జెడ్పీ చైర్మన్ దృష్టికి తీసుకొచ్చారు. విద్యుత్ సరఫరా లేక చీకట్లో మగ్గుతున్నామని ఆవేదన వక్తం చేశారు.

బొడ్డెమ్మ.. బొడ్డెమ్మ కోల్..

మంథని: 'బొడ్డెమ్మ.. బొడ్డెమ్మకోల్.. బిడ్డాలెందారు కోల్..' 'రూపాయి వెలవెల వేద్దామా.. ఎవ్వరి చేతులో వేద్దామా' అంటూ సంప్రదాయ పాటలతో బొడ్డెమ్మ వేడుకలు ప్రారంభించారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు నెలవైన మంత్రపురి వీధివీధినా ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. దసరా ఉత్సవాల్లో భాగంగా బతుకమ్మకు ముందు బొడ్డెమ్మ ఆగుకోవడం ఆనవాయితీ. స్థానిక ఆలయాలు, సంస్థల ప్రాంగణాల్లో ఆడపడచులు బొడ్డెమ్మ ఆడుకుంటున్నారు. భాద్రపద శుద్ధ పాడ్యమిన ప్రారంభమై ఆయా ప్రాంతాలను బట్టి 3, 5, 9, 11రోజులపాటు వేడుకలు నిర్వహిస్తారు. కన్యలు, ముత్తయిదువలు, యువతులు, మహిళలు ఉత్సాహంగా ఆటపాటాల్లో మునిగి తేలుతున్నారు. రోజూ అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి, చౌరంగి, శ్రీచక్రపీఠంపై గౌరమ్మ రూపంలో ప్రతిష్ఠిస్తారు. గౌరమ్మ చుట్టూ క్రమపద్ధతిలో ఎవరికివారు అలంకరించిన తమబొడ్డెమ్మ గద్దెలను పెట్టి, వాటిపై రెండు వత్తులతో నువ్వుల నూనె దీపాలు వెలిగించి పూజిస్తారు. అనంతరం అమ్మవారి చుట్టూ ప్రదక్షిణ చేస్తూ పాటలు పాడారు. కోలాటాలు, పాటలు, నృత్యాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

న్యూ ఇండియా పార్టీ అభ్యర్థిగా అశోక్

గోదావరిఖనిటౌన్: న్యూ ఇండియా పార్టీ రామగుండం ఎమ్మెల్యే అభ్యర్థిగా వేముల అశోక్‌ను ప్రకటిస్తున్నట్లు పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు జేవీ రాజు తెలిపారు. శుక్రవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వేముల అశోక్ కళాకారుడిగానేగాక సమాజ సేవాస్పృహ ఉన్న వ్యక్తి అని తెలిపారు. తమ పార్టీ సిద్ధాంతాలు, విధివిధానాలకు పూర్తిగాకట్టుబడి ఉంటారనిని అన్నారు. రానున్న ఎన్నికల్లో అశోక్‌ను గెలిపించాలని కోరారు. ఈ సమావేశంలో నాయకులు లక్ష్మీనారాయణ, రాజపోషం, శంకర్, బాణేశ్, నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

విధులకు ఆటంకం కల్పించిన ఐదుగురిపై కేసు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): వెంకటాపూర్‌లో గత నెల 30న వినాయక నిమజ్జనం సందర్భంగా పోలీసుల విధులకు ఆటంకం కల్పించిన ఐదుగురిని శుక్రవారం పోలీసులు అరెస్ట్ చేశారు. కుక్కల వెంకటేశ్, పడిగె ఆదర్శ్, కంకనాల సురేశ్, పొన్నం సాయి, కంకనాల సాయి తోపాటు మరికొందరు కలిసి పోలీసుల విధులకు ఆటంకం కల్పించారు.

చెరువులో పడి వృద్ధుడి మృతి

ధర్మారం: ఖిలావనపర్తి గ్రామానికి చెందిన మోతె కొండయ్య(70) ప్రమాదవశాత్తు చెరువులో మునిగి మరణించినట్లు ఎస్సై సత్యనారాయణ తెలిపారు. కొండయ్య బుధవారం తన బర్రెలను మేత కోసం గ్రామ శివారులోని చెరువు వద్దకు తీసుకు వెళ్లాడు. అయితే రాత్రివరకు కొండయ్య ఇంటికి తిరిగిరాలేదు. దీంతో కుటుంబసభ్యులు ఆందోళనకు గురై సమీప ప్రాంతాల్లో వెతికారు. అయినా ఫలితం లేకుండా పోయింది. కాగా, శుక్రవారం ఉదయం చెరువులో కొండయ్య శవమై నీటిపై తేలాడు. మృతుడి కుమారుడు మోతె కుమారస్వామి ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసినట్లు ఎస్సై వివరించారు.

సూపర్‌వైజర్ మృతి



ఎలిగేడు(పెద్దపల్లి): లోకపేట గ్రామంలో రోడ్డు పనులు చేస్తుండగా ఈర్ల అనిల్(35) ప్రమాదవశాత్తు మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. పోలీసుల కథనం ప్రకారం.. పెద్దపల్లిలోని ఉదయనగర్‌కు చెందిన అనిల్ ఉరఫ్ అఖిల్ సివిల్ ఇంజినీరింగ్ కోర్స్ పూర్తిచేశారు. రోడ్డు కాంట్రాక్టర్ వద్ద సూపర్‌వైజర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. శుక్రవారం ట్రాక్టర్‌తో రోడ్డుపై చదును చేస్తుండగా ఒకేసారి వెనక్కి వచ్చింది. ఇది ఢీకొనడంతో అనిల్ అక్కడికక్కడే మృతి చెందాడు. జూలపల్లి పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని శవాన్ని పోస్టుమార్టం కోసం పెద్దపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడికి భార్య, కుమారుడు ఉన్నారు. తమకు బాధిత కుటుంబ సభ్యులు ఎవరూ ఫిర్యాదు చేయలేదని పోలీసులు తెలిపారు.

ఫ్లై ఓవర్ నిర్మాణానికి ఇంకెన్నాళ్లు..?



కొలనూర్‌లో లెవల్‌క్రాసింగుగేట్ పడటంతో నిలిచిపోయిన వాహనాలు

- పెద్దపల్లి – కొలనూర్ మధ్య రైళ్ల రద్దీ
- తరచూ మూసివేస్తున్న గేట్
- సమయానికి విధులకు హాజరుకాని ఉద్యోగులు
- తరగతులు తప్పుతున్న విద్యార్థులు

ఓదెల(పెద్దపల్లి): కాజీపేట్ – బల్లార్షా సెక్షన్ల మధ్య కొలనూర్, ఓదెల, పొత్కపల్లి రైల్వేస్టేషన్ల సమీపంలో లెవల్ క్రాసింగుగేట్ వద్ద ఫ్లై ఓ వంతెనల నిర్మాణాల్లో ఎంతోజాప్యం చేసుకుంటోంది. సికింద రాబాద్ నుంచి న్యూఢిల్లీ వరకు వెళ్లే ప్రధాన ట్రాక్ కావడం, ఓదెల, కొలనూర్, పొత్కపల్లి రైల్వేస్టేషన్ల ద్వారా నిత్యం వందల సంఖ్యలో రైళ్ల రద్దీ ఉండడంతో వాటి రాకపోకల సందర్భంగా గంటల తరబడి గేట్లు మూసివేయాల్సి వస్తోంది. ఫలితంగా ప్రయాణికులు గమ్యస్థానాలు చేరుకునేందుకు నరకయాతన పడుతున్నారు. కాజీపేట్ – బల్లార్షా మధ్య మూడో రైల్వేలైను పూర్తికావటంతో రైళ్లరద్దీ పెరిగింది. దీంతో ఎప్పుడు గేట్‌పడినా 108, 104 వాహనాలకే కాదు.. ప్రజలకూ ఇబ్బందులు తప్పడం లేదు. కొలనూర్, ఓదెల, పొత్కపల్లి రైల్వేగేట్‌ల మీదుగా సుల్తానాబాద్, కాల్వశ్రీరాంపూర్, జమ్మికుంట మండలాల వాహనాలు ఆర్టీసీ బస్సులు నడుస్తాయి. ఎప్పుడూ గేట్‌పడటంతో ఆర్టీసీ బస్సులు ఎక్కడికక్కడే నిలిచిపోవటంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు, ఉద్యోగులు విధులకు సకాలంలో చేరలేక పోతున్నారు. కొలనూర్ రైల్వేస్టేషన్ సమీపంలో లెవల్ క్రాసింగుగేట్ వద్ద 1983లో ప్రైవేట్ బస్సును రైలు ఢీకొట్టడంతో 80మంది మృతిచెందారు. లెవల్ క్రాసింగ్ గేట్ వద్ద ఫ్లైఓవర్ వంతెనలు నిర్మించాలని పలుసార్లు రైల్వేశాఖ జీఎంకు వినతిపత్రాలు సమర్పించారు. అయితే, ఫ్లై ఓవర్లు మంజూరయ్యాయని ప్రకటన జారీచేసిన అధికారులు.. ఇప్పటికీ పనులు ప్రారంభించలేదు. ఓదెల, కొలనూర్, పొత్కపల్లిలో ఫ్లైఓవర్లు నిర్మిస్తే పెద్దపల్లి, కరీంనగర్ జిల్లా కేంద్రాలకు నేరుగా, ఎలాంటి ఆటంకాలు లేకుండా ప్రయాణాలు సాగించవచ్చని పల్లెవాసులు కోరుతున్నారు.

అంబులెన్సులకూ తప్పని తిప్పలు



కొలనూర్, ఓదెల, పొత్కపల్లి రైల్వేస్టేషన్ల సమీపంలోని లెవల్ క్రాసింగ్ గేట్‌లు నిత్యం పడటంతో 108, 104 వాహనాల రాకపోకలకు అంతరాయం కలుగతంది. మూడోరైల్వేలైను పూర్తికావటంతో రైళ్లరద్దీ మరింత పెరిగింది. ఎప్పుడు గేట్‌లు పడుతాయో తెలియడం లేదు. ఎంతసేపు గేట్ మూసి ఉంచుతారో అర్థం కావడంలేదు.

– రంగు బ్రహ్మచారి, ప్రయాణికుడు, కొలనూర్


దేశంలోనే పెద్దసంఘటన



కొలనూర్ లెవల్ క్రాసింగ్ గేట్ వద్ద ప్రైవేట్ సర్వీసు బస్సును జయంతి ఎక్స్‌ప్రెస్ ఢీకొట్టింది. 80మంది ప్రయాణికులు మృతిచెందారు. అప్పట్లో రైల్వేశాఖ చరిత్రలోనేకాదు.. దేశంలోనే పెద్దసంఘటన ఇది. వెంటనే రైల్వేశాఖ ఫ్లైఓవర్ వంతెన నిర్మించాలి.

– సామ ఢిల్లీశంకర్, మాజీ సర్పంచ్, కొలనూర్

రోజూ ఆలస్యమే



ఓదెల, కొలనూర్, పొత్కపల్లి రైల్వేస్టేషన్ల సమీపంలోని లెవల్ క్రాసింగ్‌ల వద్ద రైళ్లరద్దీతో గేట్‌లు పడుతున్నాయి. గంటల తరబడి మూసిఉంటున్నాయి. ఉద్యోగులు విధులకు సకాలంలో చేరలేకపోతున్నారు. రైల్వేశాఖ ప్రయాణికుల ఇబ్బందులను తొలగింగించాలి.

– గోళి అంజిరెడ్డి, సీఈవో, పొత్కపల్లి సొసైటీ



ఆంధ్రా బ్యాంక్‌లో అడ్వాన్స్ బుకింగ్ కోసం..



పదిహేను రోజుల వరకు ముందే టోకెన్‌లు ఇచ్చామంటున్న బ్యాంక్ ఆఫ్ బరోడా బ్యాంకులోని ఆధార్ నిర్వాహకులు



వేలిముద్రలు సేకరిస్తున్న ఆధార్ నిర్వాహకులు

ఆధార్ అవస్థలు

ఒకకప్పుడు సినిమా విడుదలకు ముందే టికెట్ల అడ్వాన్స్‌గా బుక్‌చేసుకునేవారు. మరి క్రికెట్ మ్యాచ్‌లకూ అడ్వాన్స్ బుకింగ్ ఉంటోంది. కానీ, ఇప్పుడు ఆధార్ అనుసంధానికీ అడ్వాన్స్ బుకింగ్ చేసుకుంటున్నారు. నెలముందుగానే ఆధార్ సెంటర్‌లో అడ్వాన్స్ బుకింగ్ చేసుకుంటేనే ఆరోగ్యశ్రీ డిజిటల్, ఆయుష్మాన్‌భారత్, లేబర్‌కార్డు, బీమా, వృద్ధాప్య, వికలాంగ పింఛన్, రేషన్ ఈకేవైసీ, పంట రుణమాఫీ, ధరణి అప్‌డేట్ అవుతున్నాయి. ఫొటో, ఐరిస్, థంబ్, మొబైల్ నంబర్‌ను ఆధార్‌కు లింక్ లేదా అప్‌డేట్ చేస్తేనే ప్రభుత్వ పథకాలకు అర్హత ఉంటోంది. దీంతో వేలాది మంది ఆధార్ సెంటర్ల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. కొన్ని బ్యాంకుల్లో ఆధార్ సెంటర్లు ఉన్నా ఇదేపద్ధతిన ముందుగానే టోకెన్లు ఇస్తున్నామని, నెల తర్వాత రావాలని నిర్వాహకులు సూచిస్తున్నారు. ఇక ప్రభుత్వ ఆధార్ సెంటర్ల వద్దకు ఉదయం వచ్చి బుక్ చేసుకుంటేనే ఆరోజు అప్‌డేట్ చేసి పంపిస్తున్నారు. ఆధార్ అప్‌డేట్‌కు ఎన్ని తిప్పలో..

– సాక్షి ఫొటోగ్రాఫర్, పెద్దపల్లి

గంజాయి కేసులో యువకుల అరెస్ట్



రామగిరి: గంజాయి తాగుతూ పట్టుబడిన యువకులను అరెస్ట్ చేసినట్లు ఎస్సై రవిప్రసాద్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. పన్నూర్ గ్రామంలో కొందరు యువకులు గంజాయి తాగుతున్నారని సమాచారం అందింది. ఈమేరకు గ్రామంలో దాడి చేయగా గడ్డం సాయికుమార్, జక్కుల రాజేందర్, కంది రఘుపతి, మానూపాటి రాజేశ్, ఉండంటి రాజ్‌కుమార్ గంజాయి తాగుతూ కనిపించారు. వారిని తనిఖీ చేయగా 100 గ్రాముల గంజాయి లభించింది. ఈమేరకు వారిని అరెస్టు చేశారు. ఈ సమావేశంలో ఎస్సై–2 దివ్య పాల్గొన్నారు.